

చెరువుల్లా రోడ్లు

ఎడతెరిపి లేని వానతో ఇక్కట్లు

- తడిసిముద్దయిన నగరం
- పొంగిపొర్లిన డ్రైనేజీలు.. కూలిన చెట్లు
- వాహనదారులకు తప్పని అవస్థలు


వర్షంలో కళాశాలకు వెళ్తున్న విద్యార్థినులు


చెరువును తలపిస్తున్న బంజారాహిల్స్ ప్రధాన రోడ్డు

బంజారాహిల్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. హిల్స్ రోడ్లపై వరద నీరు నిలవడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ సిబ్బంది వరద నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి కేబీఆర్ పార్కు వెళ్లే దారి పూర్తిగా వరదనీటితో నిండిపోయింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36లో పెద్దమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో మోకాలి లోతు వరద నీరు నిలిచింది. శ్రీనగర్‌కాలనీలో ఓ చెట్టు విరిగి పడింది. ఫిలిం నగర్‌లోని పలు బస్తీల్లో డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్ల పై ప్రవహించింది. అలాగే ఖైరతాబాద్‌లోని రైల్వేగేటు చౌరస్తా, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, మింట్ కాంపౌండ్, లక్డీకాపూల్ లక్కీ హోటల్ చౌరస్తా, లేక్‌వ్యూ గెస్ట్ హౌస్, విల్లామేరీ కళాశాల తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయింది.

మాన్‌సూన్ సిబ్బంది సిద్ధం : జోనల్ కమిషనర్


పరిస్థితిని పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ అనరాగ్

ఖైరతాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెరపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మాన్‌సూన్ బృందాలతో సిద్ధం ఉన్నామని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఆయన శనివారం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం పలుప్రాంతాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మాన్‌సూన్ టీంతో పాటు డీఆర్ఎఫ్, ఎమర్జెన్సీ టీంలు సపోర్టుగా ఉంటాయని ఆయన తెలిపారు. అలాగే ఖైరతాబాద్. జూబ్లీహిల్స్ ఉపకమిషనర్లు జగన్, ప్రశాంతిలు సైతం పలు ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.



కొత్త చట్టాలతో సత్వర న్యాయం

హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ


కార్యక్రమంలో హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ, తదితరులు

బంజారాహిల్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ నూతన చట్టాలు అభినందనీయమని హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బీనర్సింహశర్మ అన్నారు. ఈ చట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూం లా కాలేజీలో శనివారం అన్‌లాకింగ్ 'కొత్త దిశలు, దేశం కొత్త క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు ఈ చట్టాల్లో ఎంతో ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఏళ్ల తరబడి కేసులు సాగకుండా ఉండేలా ప్రతీ కేసుకు ఒక నిర్దిష్ట సమయాన్ని ఏర్పాటు చేసే విధంగా రూపొందించారన్నారు ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ ఈ చట్టాలు పారదర్శకంగా సరళతరంగా ఉన్నాయన్నారు. ఇవి బాధితులకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది

ఎర్రగడ్డ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని వినియోగించుకోవాలని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్ బాబు సూచించారు. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో శనివారం ఎర్రగడ్డలోని ఓల్డ్ సుల్తాన్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బస్తీ వాసులకు షుగర్, అనీమియా, చర్మవ్యాధులు, గైనకాలజీ తదితర విభాగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు దేవి దాస్, బొట్టు విజయకుమార్, సభ్యులు ఎల్లమేశ్వరరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.







భళా.. కూచిపూడి నాట్య ప్రదర్శన

మాదాపూర్, జూలై20(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన సందర్శకుల మదిని దోచుకుంది. నాట్య గురువు రవి శిష్యబృందం కూచిపూడి నాట్య గురువందనం నిర్వహించారు. శ్లోకాలు, జతులు, మూషిక వాహన, పుష్పాంజలి, బ్రహ్మాంజలి, పలుకే బంగారమయ్యే, శివస్తుతి తదితర అంశాలపై ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. అలాగే మాదాపూర్‌లోని అన్నమయ్య భావన వాహినిలో గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధికారులకు సూచించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సారథి నగర్ సొసైటీలో ప్రభుత్వ రోడ్డు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో ఆయన అధికారులతో కలిసి శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్ల విలువైన స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి ప్రహరీ నిర్మించుకుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

ఎర్రగడ్డలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గోపీనాథ్ కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 మందికి రూ.34,03,944 విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి సంజీవ, షరీఫ్, షేక్ జావిద్, సయ్యద్ రసూల్, శ్రీకాంత్, తరుణ్, అనిల్, ముజీబ్ ఖాన్, బాలు, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బంది, కార్మికులకు రక్షణ కల్పించాలి

పంజాగుట్ట, జూలై20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది, కార్మికులపై దాడులు పెరుగుతున్నాయని స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్(1535) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఏ వజీర్ ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం ఆయన బాధితుడు సాయి గణేశ్‌తో కలిసి మాట్లాడారు. ఇటీవల పాతబస్తీలో బకాయి చెల్లించాలని అడిగినందుకు మీటర్ రీడర్ సాయి గణేశ్, ఎల్ఐ శ్రీకాంత్‌లపై దాడి చేశాడన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.ప్రమోద్ కుమార్, కె.శ్రీనివాస్, కె.లింగం పాల్గొన్నారు.



కారును దొంగిలించి.. భోపాల్‌లో అమ్మేందుకు విఫలయత్నం

బంజారాహిల్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కారును దొంగిలించి నగరంలో అమ్మితే పట్టుబడే ప్రమాదం ఉందని మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు తీసుకువెళ్లారు. వారి కదలికలను పసిగట్టిన పోలీసులు కారును స్వాధీనం చేసుకోవడంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ నెల 16న నగరంలోని ఓ వ్యాపారి ఇంట్లో వెర్నా కారు చోరీకి గురైంది. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఫిలింనగర్ పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా కారు భోపాల్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి నిందితులు అంగ్రిజ్ రోహిత్, చాకలి హేమంత్, మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా రోహిత్ ఆ వ్యాపారి ఇంట్లో కొద్ది రోజులు పనిచేసినట్టు తేలింది.





ప్రార్థనా సమయాల్లో చోరీ.. పాత నేరస్థుడి అరెస్టు

బంజారాహిల్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రార్థన సమయాల్లో భక్తుడిలా వచ్చి చాకచక్యంగా చోరీలు చేస్తున్న పాత నేరస్థుడిని పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 26న గోల్కొండ సెవెన్ ట్యూంబ్స్ వద్ద అక్సా మసీదులో ఓ బ్యాగులో ఉన్న లాప్‌టాప్, మూడు తులాల బంగారు నెక్లెస్ చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఆ ప్రాంతంలో ఉండే పాత నేరస్థుడు మహ్మద్ ఆమెర్‌పై అనుమానం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకుంటే అసలు విషయం తెలిసింది. నిందితుడి వద్ద నుంచి లాప్‌టాప్, సామ్‌సంగ్ ట్యాబ్, మూడు తులాల బంగారు నెక్లెస్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


షాపింగ్‌కు వచ్చి రూ.8 లక్షల విలువైన చీరల చోరీ

బంజారాహిల్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): షాపింగ్‌కు వచ్చిన మహిళలు లక్షల విలువైన చీరలతో ఉడాయించారు. 15న స్థానిక స్వదేశీశారీ షోరూంకు ముగ్గురు మహిళలు, ట్రాన్స్‌జెండర్ షాపింగ్‌కు వచ్చారు. సేల్స్‌మెన్‌తో బేరమాడి వెళ్లిపోయారు. అనంతరం రూ.8లక్షల విలువైన 5చీరలు పోయినట్లు నిర్వాహకులు గుర్తించారు. ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.









భక్తిశ్రద్ధలతో సాయి సప్తాహ వేడుకలు

పద్మారావునగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమిని పురస్కరించుకొని పద్మారావునగర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న సాయి సప్తాహ వేడుకలలో భాగంగా ఆరవ రోజైన శనివారం భక్తజన సందోహం నడుమ అత్యంత భక్తిశ్రద్ధలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను ఆలయ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కేంద్ర మంత్రితో సికిందరాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుదర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికిందరాబాద్ పార్లమెంటు కన్వీనర్ రాజశేఖర రెడ్డి, యువ నాయకులు మర్రి పురూరవరెడ్డి పాల్గొన్నారు.


సాయి సప్తాహ ప్రత్యేక పూజకు హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,ఈటల రాజేందర్

ఉత్తరాఖండ్ మృతుడి కుటుంబానికి కేంద్ర మంత్రి పరామర్శ

పద్మారావునగర్ : ఉత్తరాఖండ్ ప్రమాద ఘటన బాధితుడి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకొంటామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6వ తేదీన బద్రీనాథ్ ఆలయ దర్శనం అనంతరం తిరిగి హైదరాబాద్ వస్తున్న తరుణంలో కొండచరియలు విరిగిపడి, స్కందగిరికి చెందిన దార సత్యనారాయణ మృతి చెందిన విషయం విదితమే. శనివారం పద్మారావునగర్ స్కందగిరిలోని ప్రియా అపార్ట్‌మెంట్‌లోని బాధితుడి ఇంటికి వెళ్లిన కేంద్ర మంత్రి ఈ సందర్భంగా మృతుడి భార్య హేమలత, కుమారుడు సాయినిఖిల్‌లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉత్తరాఖండ్ ప్రమాద ఘటన తెలిసిన తాను తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించానని ఆయన తెలిపారు. మంత్రి వెంట బీజేపీ నాయకులు రాజశేఖర రెడ్డి, ఎక్కాల శ్రీనివాస్ ఉన్నారు.


బోనాల జాతరకు ముస్తాబైన నల్ల పోచమ్మ ఆలయం

నేడు నల్ల పోచమ్మ బోనాల జాతర

మారేడుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు పరిధి మహాత్మా గాంధీనగర్‌లో నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల జాతర ఉత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా సర్వం సిద్ధం చేశారు. లష్కర్ బోనాల పండుగ రోజే నల్ల పోచమ్మ బోనాల జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. మహాత్మా గాంధీనగర్, దుర్గయ్య గార్డెన్, గణేష్ నగర్ కాలనీ, వాల్మీకినగర్ సగ భాగం బస్తీ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఇంటింటికీ బోనాలు తీసి అమ్మవారికి సమర్పిస్తారు. ఇక్కడ నివాసముండే ప్రజలు రాష్ట్రంలోని వివిధ పల్లెటూర్లు, గ్రామాలకు చెందిన ప్రజలు కావడంతో అమ్మవారిని నిండుమనసుతో కొలుస్తూ ప్రత్యేక పూజలు చేసి, కుటుంబ సమేతంగా దర్శించుకుంటారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో జి.సాయి ఆధ్వర్యంలో ఫలహారుపు బండి ఊరేగిస్తున్నట్లు నిర్వాహకులు గంట రాజు తెలిపారు.


అమ్మమాట- అంగన్వాడి బాట ముగింపున ర్యాలీలో చిన్నారులు

ముగిసిన అమ్మమాట - అంగన్వాడీ బాట ర్యాలీ

అడ్డగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేధాశక్తి పెంచేందుకు చదవు పట్ల ప్రత్యేక దృష్టిపెడుతున్నామని అంగన్వాడీ టీచర్ స్వరూప అన్నారు. ఈనెల 15 నుంచి 20 వరకు రాష్ట్రంలో జరిగే "అమ్మ మాట - అంగన్వాడీ బాట" ముగింపు కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఉన్న అంగన్వాడీ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు టీచర్లమైన తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అంగన్‌వ్వాడీ టీచర్లు స్వరూప, లక్ష్మి, అనిత, పద్మ పాల్గొన్నారు.


పద్మారావు గౌడ్‌కు ఆహ్వాన పత్రం అందచేస్తున్న ఈవో, అర్చకులు

మహాకాళి అమ్మవారి జాతరకు రావాలని పద్మారావు గౌడ్‌కు ఆహ్వానం

రెజిమెంటల్‌బజార్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల జాతరకు హాజరుకావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌కు ఆహ్వానం అందించారు. శనివారం టకారబస్తీలోని ఆయన నివాసంకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేందర్ రెడ్డి, అర్చకులు వెళ్లి పద్మారావు దంపతులను సత్కరించి, ఆహ్వానం పత్రం అందించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కందిశైలజ, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు

పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

- కార్పొరేటర్ కందిశైలజ

బౌద్ధనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ కోరారు. శనివారం బౌద్ధనగర్ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఎంఎస్ఐ-యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమెతోపాటు టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుంచి పదిహేను సంవత్సరాలలోపు వారికి టీకాలు తప్పనిసరి అని, కొందరు టీకాలపై అవగాహన లేకపోవటంతో టీకాలు వేయించటంలేదన్నారు. పిల్లలకు టీకాలు ఇవ్వటం వలన పలు వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, వాసు, రెడ్‌క్రాస్ ఆస్పత్రి వైద్యురాలు ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.


పల్లవి స్కూల్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది

ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం

బోయిన్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడానికి పల్లవి మోడల్ స్కూల్‌లో వనమహోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా హరిత కార్యక్రమాలను ప్రోత్సహించే ఉమ్మడి లక్ష్యంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అతిథులు అందరూ ఏకమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సునందారెడ్డి, పర్యావరణ పరిరక్షణకు విశేష కృషిచేసిన ప్రవీణ, పల్లవి స్కూల్ డైరెక్టర్ డాక్టర్ వై.ఎస్.కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు రోడ్లలో మొక్కలను నాటారు. అదేవిధంగా పచ్చదనాన్ని పెంపొందించడానికి ఒక అడుగు మాత్రమే కాకుండా పర్యావరణాన్ని పెంపొందించడం రక్షించడం ప్రాముఖ్యత గురించి అతిథులు విద్యార్థులకు సూచించారు.

ఆర్ఎస్ఐ సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా చిక్కిన దొంగ

ఉప్పల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్సైగా పనిచేస్తున్న పరోష సైదయ్య విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు చిలుకానగర్ బస్టాప్ వద్ద శనివారం ఉన్నాడు. బస్ ఎక్కే క్రమంలో సెల్‌ఫోన్ కొట్టేస్తుండగా దొంగను పట్టుకుని ఉప్పల్ పోలీసులకు అప్పగించాడు. మహబూబాబాద్ జిల్లా విస్సంపల్లి గ్రామానికి చెందిన దుంపల రాజేష్(35)గా పోలీసులు గుర్తించారు. ఇతడు డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిపై నాలుగు దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

- కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్


ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో జంపన ప్రతాప్‌తో సంఘ సేవకుడు రాజేందర్ గుప్తా

బోయిన్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ ముందుకువచ్చి తోచినవిధంగా సహకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నేత జంపనప్రతాప్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సంఘ సేవకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజేందర్‌గుప్తా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, బిస్కెట్లతో పాటు అరిగే రామస్వామి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన బెంచ్‌లను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ నారాయణ, అజిత్ కల్యాణ్, రామారావు, శ్రీకాంత్, వరప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, షఢిక్, శోభారాణి, పద్మావతి, హరినాథ్, సరిత తదితరులు పాల్గొన్నారు.


జేబీఎస్ పరిసర ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రోడ్లు

జేబీఎస్ వద్ద అధ్వానంగా రోడ్డు

మారేడుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ బస్ స్టేషన్ ముందు ఉన్న సిటీ బస్‌స్టాప్‌లో ఆర్టీసీ బస్సులు నిలిపే ప్రధాన రహదారి కోసుకుపోయిపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. జూబ్లీ బస్ స్టేషన్‌లోనికి వెళ్లే ప్రయాణికులు వివిధ జిల్లాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికులు ఈ రోడ్ల వల్ల అసౌకర్యానికి అవుతున్నారు. వేలాదిమంది రాకపోకలు సాగించే ప్రధాన రోడ్ల దుస్థితి ఇలా ఉండడం ఏమిటని ప్రయాణికులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. వెంటనే రోడ్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఉత్తమ ప్రతిభ కనబర్చిన బీటెక్ విద్యార్థినికి గోల్డ్ మెడల్‌తో పాటు, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న జమ్మూకాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఎ.రవీంద్రనాథ్ తదితరులు

ఓయూలో ఘనంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవం

తార్నాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవాన్ని శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని టెక్నాలజీ కాలేజ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జమ్మూ కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, గవర్నింగ్‌బాడీ చైర్మన్ ప్రొ.ఎ.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయి 2020-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బీటెక్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తో పాటు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణల దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.చింతసాయిలు, వైస్ ప్రిన్సిపాల్ వి.రమేష్ కుమార్, డీన్ ప్రొ. వి.వి బసవరావు, ప్రొ.అయవధన తదితరులు పాల్గొన్నారు.

తెరిపి లేని వానతో ఇబ్బందులు

బౌద్ధనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం వారాసిగూడలో ఓ చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జీహెచ్ఎంసీ సిబ్బంది పడిపోయిన చెట్టును తొలగించారు. వారాసిగూడ పోచమ్మ ఆలయం, న్యూఅశోక్‌నగర్, పుల్లయ్యబావి, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచింది. శనివారం ఉదయం పలు లోతట్టు ప్రాంతాల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, అధికారులతో కలిసి పర్యటించారు. బ్రాహ్మణబస్తీలో గుంతలు పడిన రోడ్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.


బ్రాహ్మణబస్తీలో గుంతలు పడినరోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామలహేమ


వారాసిగూడలో రోడ్డుపై పడిన చెట్టు

బంగారం చోరీ చేసిన ముఠా అరెస్టు

- షాపులో పనిచేసే వ్యక్తి సూత్రధారి
- మరో నలుగురితో కలిసి చోరీ

రెజిమెంటల్‌బజార్,జూలై 20 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న షాపునకు చెందిన బంగారం చోరీ చేసి, గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని నమ్మించాలనుకుని పథకం వేసిన యువకుడితో పాటు, సహకరించిన నలుగురు కటకటాల పాలయ్యారు. గురువారం (జూలై 18వ తేదీ) ఓ జ్యువెల్లరీ షాపు నుంచి మరో జ్యువెల్లరీ షాపునకు తరలిస్తున్న బంగారం చోరీకి గురైన విషయం విదితమే. ఐదుగురు వ్యక్తులు పథకం ప్రకారం చోరీకి పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పాట్ మార్కెట్‌లో ఉన్న సాయినాథ్ గోల్డ్ షాపులో పనిచేసే రాజాస్థాన్‌కు చెందిన దినేష్(18) యజమాని చెప్పిన విధంగా ఇతర గోల్డ్ షాపులకు బంగారం ఇవ్వడం, తీసుకురావడం చేస్తుంటాడు. ఎప్పటి మాదిరిగానే జూలై 18వ తేదీన దినేష్ శ్రీనీ జ్యువెల్లర్స్‌కు చెందిన 26 బంగారు నెక్లెస్‌లు, 650 గ్రాముల బరువున్న ఆభరణాలు తీసుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో మహేందర్ లోహర్ (24), ప్రవీణ్ కుమార్ (21), భవాని గిరి (21)లకు సమాచారం అందించాడు.

దినేష్ ద్విచక్ర వాహనంపై క్లాక్‌టవర్‌కు చేరుకోగానే, ముందుగానే అనుకున్న పథకం ప్రకారం దినేష్‌ను అడ్డగించి బ్యాగ్ తీసుకుని పారిపోయారు. దినేష్ ఏమీ తెలియనట్లు బంగారం ఎత్తుకెళ్లారని ఓనర్ ప్రఫుల్ జైన్‌కు సమాచారం అందించాడు. అదే రోజు ఓనర్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన తరువాత మహేందర్, దినేష్, ప్రవీణ్ కుమార్ కలిసి వారి సొంతూరు రాజస్థాన్‌కు వెళ్లాలని భావించి కాజీపేటకు చేరుకున్న తరువాత మనసు మార్చుకుని విజయవాడకు వెళ్లి అందులోని ఆరు ఆభరణాలు అమ్మేశారు. హైదరాబాద్‌కు వచ్చి మిగతా 20 బంగారు ఆభరణాలు అమ్మాలని భావించారు. నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు అల్వాల్‌లోని మహేందర్ లోహర్ నివాసంలో ఉన్నట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.


నిందితులను, స్వాధీనం చేసుకున్న బంగారంను చూపిస్తున్న అదనపు డీసీపీ అశోక్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్


అల్వాల్‌లోని సినిమా థియేటర్‌ను తనిఖీ చేసిన డీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీపీ సాంబయ్య

సినిమా టికెట్లు ఉన్నవారి నుంచి పార్కింగ్ ఫీజు తీసుకోవద్దు

- ప్రేక్షకులకు సౌకర్యాలను కల్పించాలి : డీసీ

అల్వాల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సినిమా టికెట్లు ఉన్నవారి నుంచి పార్కింగ్ ఫీజు తీసుకోవద్దని డీసీ శ్రీనివాస్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్‌లలో వసూలు చేసే పార్కింగ్ ఫీజులపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కీలక ఆదేశాలు జారీచేశారు. దీంతో శనివారం అల్వాల్ సర్కిల్ పరిధిలో ఉన్న లక్ష్మీకళామందిర్ సినిమా థియేటర్‌లో డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ నర్సింహారెడ్డి, టౌన్‌ప్లానింగ్ డీసీపీ సాంబయ్య, టీపీఎస్ రాజేందర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా టికెట్లు ఉన్నవారి నుంచి ఎలాంటి పార్కింగ్ ఫీజూ వసూలు చేయవద్దని సంబంధిత థియేటర్ల యజమానులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రేక్షకులకు సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా థియేటర్‌లో ఫుడ్‌స్టాళ్లు, ఫైర్‌సేఫ్టీ, బిల్డింగ్ అనుమతి, ప్రాపర్టీటాక్స్, ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు వంటి అంశాలను అధికారులు పరిశీలించారు.


సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేనకు అసోసియేషన్ అధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తున్న ఆజాద్

అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేనకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ కోట్ల రూపాయల అక్రమ సంపాదన కోసం ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు పేద విద్యార్థులను ఇంజనీరింగ్ విద్యకు దూరం చేస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో ఇంజనీరింగ్ సీటును రూ.16లక్షల నుంచి 25లక్షలకు అమ్ముకుంటూ విద్యా కేంద్రాల్లో మాఫియాను కొనసాగిస్తున్నాయన్నారు. ఈఈఈ, సివిల్, మెకానిక్ కోర్సుల స్థానంలో సీఎస్ఈ అనుబంధ సెక్షన్ల పెంపు కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. అటానమస్ పేరుతో విచ్చలవిడిగా ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను నడిపిస్తూ కాలేజీ ట్రాన్స్‌పోర్టు పేరిట ముందుగానే విద్యార్థుల నుంచి డబ్బులు దండుకుంటున్నారని, అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అటానమస్ వ్యవస్థను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ పోగుల చిరంజీవి యాదవ్, భూక్య రవినాయక్, చేవెళ్ల యాదగిరి పాల్గొన్నారు.


విద్యార్థిని చదువుకి ఆర్థిక సాయం చేస్తున్న నవయుగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సంస్థ

చిన్నారి చదువుకు ఆర్థిక సాయం

అడ్డగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌కు చెందిన దేవి సాయి విద్యార్థి స్కూలులో ఎల్‌కేజీ చదువుతోంది. తండ్రి చనిపోవడంతో స్కూలు ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న ఈపేద విద్యార్థికి నవయుగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సంస్థ సాయి విద్యార్థి స్కూలు ప్రిన్సిపల్ ప్రసాద్‌కు ఏడాది ఫీజు చెల్లించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ పేద చిన్నారికి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల ఉండడం వల్ల కొంత ఆర్థికంగా నగదు సాయం చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏడాది చదువుతోపాటు కుటుంబ పోషణకు సంస్థ ఆదుకుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు.



జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌కువినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

కాప్రా, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాప్రా సర్కిల్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ జె.ప్రభుదాస్ శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. బండబావి ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని, పలు కాలనీలలో కొత్తగా సీసీరోడ్లు వేయాలని, పార్కుల్లో పాడైన ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేయాలని, ఇతర పార్కుల్లో కొత్తగా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేయాలని ఆయన జెడ్సీకి విజ్ఞప్తి చేశారు. దీనికి జెడ్సీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే డివిజన్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.